నమస్తే తెలంగాణ
# నల్లగొండ
6 నల్లగొండ, మంగళవారం 3 జూన్ 2025 NALGONDA



## ఇదీ.. బియ్యం వరుస!

రేషన్ బియ్యం కోసం లబ్ధిదారులు నానాతంటాలు పడుతున్నారు. మూడు నెలల బియ్యం ఒకేసారి ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేయలేదు. దీంతో రేషన్ షాపులకు వచ్చిన కార్డుదారులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో ఎక్కడ చూసినా రేషన్ షాపుల వద్ద పెద్దపెద్ద క్యూలు కనిపిస్తున్నాయి. నిలబడే ఓపిక లేక ఖాళీ బస్తాలను క్యూలైన్లలో పెడుతున్నారు. డీలర్లు మాత్రం సర్వర్ బిజీ అనీ.. బియ్యం సరిపడా రాలేదనీ.. సమాధానం చెబుతున్నారు. తక్షణమే తగిన ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సూర్యాపేట



వర్చువల్ విధానంలో కోర్టు భవనాన్ని ప్రారంభిస్తున్న హైకోర్టు ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి సుజోయ్‌పాల్

## ప్రజలకు మెరుగైన న్యాయసేవలు అందించాలి

- హైకోర్టు ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి సుజోయ్‌పాల్
- వర్చువల్‌గా నిడమనూరు జూనియర్ సివిల్ జడ్జి
- కోర్టు భవన సముదాయం ప్రారంభోత్సవం

నిడమనూరు, జూన్ 2 : ప్రజలకు మెరుగైన న్యాయసేవలు అందించేందుకు న్యాయవాదులు కృషి చేయాలని హైకోర్టు ఇన్‌చార్జి ప్రధాన న్యాయమూర్తి సుజోయ్‌పాల్ అన్నారు. నిడమనూరు మండల కేంద్రంలో రూ.5.50 కోట్లతో నిర్మించిన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు భవన సముదాయం, జడ్జి నివాస గృహాన్ని హైకోర్టు పోర్టుఫోలియో న్యాయమూర్తి టీ వినోద్ కుమార్, న్యాయమూర్తులు శ్రీసుధ, కె.సుజన, రాధారాణితో కలిసి సోమవారం వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసుల సత్వర పరిష్కారానికి న్యాయవాదులు సహకరించి ప్రజల్లో న్యాయవ్యవస్థపై నమ్మకం కల్గించాలని సూచించారు. పక్కాభవన నిర్మాణంతో ప్రజలకు న్యాయసేవలు మరింత చేరువవుతాయన్నారు. నూతన భవన ప్రారంభోత్సవం సందర్భంగా నిడమనూరు బార్ అసోసియేషన్‌కు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నిడమనూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎంసీ కోటిరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి నాగరాజు మాట్లాడుతూ.. కేసుల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా న్యాయవాదులు సేవలు కొనసాగించాలని సూచించారు. అనంతరం ఆయనను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా జడ్జి సంపూర్ణానంద్, మిర్యాలగూడ ఐదో అదనపు జిల్లా జడ్జి వేణు, నిడమనూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జి పవన్‌కుమార్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్, అదనపు ఎస్పీ రమేశ్, తహసీల్దార్ జంగాల కృష్ణయ్య, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉన్నం చిన్నవీరయ్య, న్యాయవాదులు పాల్గొన్నారు.



### మాజీ మంత్రి హరీశ్‌రావుకు
## పుట్టినరోజు శుభాకాంక్షలు

కట్టంగూర్/చిట్యాల, జూన్ 2: మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును నకిరేకల్, నల్లగొండ, దేవరకొండ, మునుగోడు, మిర్యాగూడ మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డి, రవీంద్రకుమార్ నాయక్, కూసుకుంట్ల ప్రభాకర్, భాస్కర్‌రావు, జడ్పీమాజీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి సోమవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. వారి వెంట నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి, రేగట్టే మల్లికార్జున్‌రెడ్డి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు.



తెలంగాణ ఆవిర్భావం సందర్భంగా జాతీయ పతాకం, బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్, తదితర నాయకులు



తెలంగాణ ఆవిర్భావం సందర్భంగా జాతీయ పతాకం, బీఆర్‌ఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రవీందర్ నాయక్, తదితర నాయకులు



యాదాద్రి భువనగిరి జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అవతరణ దినోత్సవంలో పాల్గొన్న మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్ రెడ్డి, బూడిద భిక్షమయ్య గౌడ్, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు

# వైభవంగా ఆవిర్భావ వేడుకలు

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా వైభవంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ కార్యాలయాల్లో జాతీయ జెండాలు, పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అమరవీరులకు నివాళులర్పించారు. వారు చేసిన త్యాగాలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో కేసీఆర్ కృషిని మరోసారి నెమరువేసుకున్నారు. ఎంతో మంది త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణను కేసీఆర్ ఎంతో అభివృద్ధి చేశారని..దేశంలోనే నంబర్ వన్‌గా నిలిపారని పలువురు వక్తలు పేర్కొన్నారు. అడ్డగోలు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను విస్మరించిందని విమర్శించారు. నల్లగొండ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్రకుమార్, సూర్యాపేట జిల్లా పార్టీ ఆఫీసులో పార్టీ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్యయాదవ్, యాదాద్రి భువనగిరి జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి పార్టీ జెండాతో పాటు జాతీయ జెండాను ఆవిష్కరించారు.

## రోల్ మోడల్‌గా తీర్చిదిద్దిన కేసీఆర్

### బీఆర్‌ఎస్ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు రవీంద్రకుమార్

నీలగిరి, జూన్ 2 (నమస్తే తెలంగాణ) : ప్రాణాలు పణంగా పెట్టి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ నిర్వీర్యం చేస్తున్నదని బీఆర్‌ఎస్ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్రకుమార్ జెండాను, జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, నల్లబోతు భాస్కర్‌రావు, తిప్పన విజయసింహారెడ్డి, కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రాంచంద్రనాయక్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి అంచెలంచెలుగా అభివృద్ధి చేసి దేశంలోనే తెలంగాణను రోల్ మోడల్‌గా కేసీఆర్ తీర్చిదిద్దారన్నారు. అలివికాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని వారు విమర్శించారు. కాంగ్రెస్ గొప్పగా చెబుతున్న అందాల పోటీలకు ప్రపంచ దేశాల నుంచి అందెగత్తెలు వచ్చారని, కానీ వారు సందర్శించిన బుద్ధవనం, పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్, యాదగిరిగుట్ట, సెక్రటేరియట్ ఎవరు నిర్మించారని ప్రశ్నించారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన శ్రీ అభినయ కూచిపూడి కళాకారులను వారు అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు చీర పంకజ్‌యాదవ్, బొర్రా సుధాకర్, జేఏసీ చైర్మన్ జి.వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, శరణ్యారెడ్డి, మాజీ కౌన్సిలర్లు కొండూరు సత్యనారాయణ, అభిమన్యు శ్రీనివాస్, సింగం రామ్మోహన్, రావుల శ్రీనివాస్‌రెడ్డి మారగోని గణేష్, దండెంపల్లి సత్తయ్య, జమాల్ ఖాద్రీ, పట్టణ అధ్యక్షులు బోనగిరి దేవేందర్, బక్కా పిచ్చయ్య, మైనం శ్రీనివాస్, పల్‌రెడ్డి రవీందర్‌రెడ్డి, నాయకులు బొమ్మరబోయిన నాగార్జున, కడారి కృష్ణయ్య, బడుపుల శంకర్, బొజ్జ వెంకన్న, కందుల లక్ష్మయ్య, గాలి రాధిక, కొండ్ర స్వరూప, కూన్‌రెడ్డి సరోజ, యాట జయప్రద తదితరులు ఉన్నారు.

### కేసీఆర్ కృషి ఫలితంగానే
## ప్రత్యేక రాష్ట్ర కల సాకారం
### ఆవిర్భావ వేడుకల్లో బడుగుల

సూర్యాపేటటౌన్, జూన్ 2: కేసీఆర్ కృషి ఫలితంగానే ప్రత్యేక రాష్ట్రం కల సాకారమైందని బీఆర్‌ఎస్ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా సోమవారం సూర్యాపేట బీఆర్‌ఎస్ కార్యాలయంలో జాతీయ పతాకాన్ని బడుగుల లింగయ్య యాదవ్, పార్టీ పతాకాన్ని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల కన్నీళ్లు, కష్టాలను చూసి చలించిన కేసీఆర్ 2001లో బీఆర్‌ఎస్‌ను స్థాపించారని గుర్తు చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా సాధించుకున్న రాష్ట్రంలో ప్రొఫెసర్ జయశంకర్ ఆలోచనలు, అంబేద్కర్ ఆశయాలను అమలు చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. సాగునీరు, తాగునీరు, 24 గంటల ఉచిత విద్యుత్, నిరుపేద విద్యార్థులకు గురుకులాలను ఏర్పాటు చేసి బడుగు, బలహీన, సబ్బండ వర్గాల అభివృద్ధికి వేల కోట్ల రూపాయలు కేటాయించి తెలంగాణను రోల్ మోడల్ చేశారని గుర్తు చేశారు. నేడు అధికారంలో ఉన్న సీఎం, మంత్రుల పదవులను కేసీఆర్ ఇచ్చినవనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అమలుకు సాధ్యంకాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తంగా తయారయిందన్నారు. సీఎం, మంత్రులు దోచుకునే పనిలో ఉన్నారని, కమిషన్లు లేనిదే పనులు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో గోపగాని వెంకటనారాయణ గౌడ్, నిమ్మల శ్రీనివాస్, పెరుమాళ్ల అన్నపూర్ణ, నెమ్మాది భిక్షం, జీడీ భిక్షం, తూడి నర్సింహారావు, చింతలపాటి భరత్ మహాజన్, గండూరి కృపాకర్, సుంకరి రమేశ్, ఎస్‌కేరఫీ, సయ్యద్ సలీం, లవకుశ, కక్కిరేణి నాగయ్య, బైరు వెంకన్నగౌడ్, దేవత్ కిషన్, మద్దెల వీరస్వామిలతోపాటు ఆయా మండలాల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిదులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### తెలంగాణ తల్లి విగ్రహానికి
## పూలమాలలు

బీబీనగర్, జూన్ 2 : తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని భువనగిరి పట్టణ కేంద్రంలో జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, భువనగిరి మాజీ శాసనసభ్యులు పైళ్ల శేఖర్‌రెడ్డి, ప్రభుత్వ మాజీ విప్ గొంగిడి సునీతామహేందర్ రెడ్డి, మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకల్లో బీబీనగర్ మండల బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు పాల్గొని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు సమర్పించి ప్రజలందరికీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు రాచమల్ల శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ ఎరుకల సుధాకర్‌గౌడ్, రైతుబంధు సమితి మండల మాజీ అధ్యక్షుడు బొక్క జయపాల్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు గాదె నరేందర్‌రెడ్డి, ఆకుల ప్రభాకర్, గుంటిపల్లి లక్ష్మీనారాయణ, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు పిట్టల అశోక్, మాజీ ఎంపీటీసీ గోరుకంటి బాలచందర్, సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు మంచాల రవికుమార్, పంజాల సతీశ్ గౌడ్, జక్కి నగేశ్, పచ్చిమట్ల వంశీ తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట సమీకృత కలెక్టరేట్‌లో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ఉత్తమ్



నల్లగొండ సమీకృత కలెక్టరేట్‌లో జాతీయజెండాకు సెల్యూట్ చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి



యాదాద్రి భువనగిరి సమీకృత కలెక్టరేట్‌లో జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి

### అభివృద్ధిలో
## అగ్రగామిగా నిలుపుదాం

- త్యాగాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు
- తెలంగాణ రైజింగ్-2047 పేరుతో సమగ్ర పాలసీ రూపకల్పన
- 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రాష్ట్రంలో రెండోస్థానంలో నిలిచాం
- బ్రాహ్మణవెల్లంల లిఫ్టు ఇరిగేషన్ పూర్తితో అదనంగా మరో పదివేల ఎకరాలకు ఆయకట్టు
- సంక్షేమ పథకాల్లో మహిళలకు ప్రాధాన్యం
- ఎత్తిపోతల పథకాలను సత్వరమే పూర్తి చేస్తాం
- సన్నబియ్యం అందజేస్తున్నాం
- అభివృద్ధిలో అగ్రగామిగా రాష్ట్రాన్ని నిలుపుదాం
- తెలంగాణ అవతరణ దినోత్సవ వేడుకల్లో మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మండలి చెర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి వెల్లడి

వివరాలు 7లో..